# ఉత్తరమున నున్న గలిలయకు

## చదువుటకు నియమించినవి #5

IV. యేసు పరిచర్యలో మొదటి పస్కా నుండి రెండవ దానికి (కొనసాగింది).
   C. యూదయనుండి గలిలయకు మార్పు.
      1. మార్పుకు కారణాలు (మత్తయి 4:12; మార్కు 1:14; లూకా 3:19, 20; యోహాను 4:1-3).
      2. సమరయలోని సంఘటన (యోహాను 4:4-42).
      3. గలిలయకు చేరడం (లూకా 4:14; యోహాను 4:43-45).
   D. గలిలయలో క్రీస్తు బోధ వివరాలు (మత్తయి 4:17; మార్కు 1:14, 15; లూకా 4:14, 15).
   E. కానాలో రెండవ అద్భుతం (యోహాను 4:46-54).
   F. గలిలయలోని కపెర్నహూమునకు మార్పు (మత్తయి 4:13-16).
   G. నలుగురు బెస్తవాళ్ళకి పిలుపు (మత్తయి 4:18-22; మార్కు 1:16-20; లూకా 5:1-11).

### పరిచయం

"ప్రతిదానికి ఒక తొలిసారి" అనే పాఠం - యోహానుచే రికార్డు చేసింది. యెరూషలేము మరియు యూదయలో ప్రభువైన యేసుయొక్క ఆరంభ పరిచర్యను గూర్చినది. ఈ స్టడీలో, రంగం ఉత్తరమున నున్న గలిలయకు మార్చబడింది. "గొప్ప గలిలయకు పరిచర్య" పై సినాప్టిక్ గాస్పుల్స్ దృష్టిని కేంద్రీకరించాయి. ఇది దాదాపుగా ఒకటిన్నర సంవత్సరాలు జరిగింది. ఈ పాఠం ఆ పరిచర్యను గూర్చిన ప్రారంభ విషయాలను తెలుపుతుంది.

### ఉత్తరం వైపుకు వెళ్లే సమయం
### (మత్తయి 4:12; మార్కు 1:14; లూకా 3:19, 20; యోహాను 4:1-4)

యూదయలో క్రీస్తూ, ఆయన శిష్యులూ విజయం సాధిస్తున్నారు - వారు ఉపదేశిస్తూ బాప్తిస్మమిచ్చు యోహానుకంటెను ఎక్కువ మంది శిష్యులను చేసికోగలిగారు (యోహాను 3:22, 26; 4:1). ఈ విజయ పరాకాష్ఠ దశలో, యూదయను విడిచి గలిలయకు తిరిగి వెళ్ళాలని క్రీస్తు నిర్ణయించుకున్నాడు. ఈ ప్రత్యేకమైన ఈ దశను చేరుకోడానికి రెండు విషయాలు దోహదం చేసాయి.

ఈ తీర్మానానికి మత్తయి మార్కులు ఒక కారణం యిచ్చారు. మత్తయి 4:12 యిలా అంది: "యోహాను [హేరోదుచే][1] చెరపట్టబడెనని యేసు విని గలిలయకు తిరిగి" వెళ్లెను, (మార్కు 1:14 చూడు).[2] చతుర్థాధిపతియైన హేరోదు, ఫిలిప్పు అను తన సహోదరుని భార్యయైన[3] హేరోదియతో ఉంటున్నాడు. భయములేని ఆ స్నానికుడు, "హేరోదియను ఉంచుకొనుట న్యాయముకాదని" హేరోదుతో చెప్పాడు (మత్తయి 14:4). ఇది హేరోదియకు కోపం పుట్టించి, యోహానును చెరపట్టేలా హేరోదుమీద ఒత్తిడి తెచ్చింది (మార్కు 6:17–19). గనుక ఆ ఏలిక యోహానును చెరసాలలో వేయించాడు (లూకా 3:20).[4]

యోహాను చెరపట్టబడెనని యేసు విని గలిలయకు తిరిగి వెళ్లెను అని నీవు చదివినప్పుడు, టిట్రాక్ తనను కూడా బంధిస్తాడని తెలుసుకున్న యేసు హేరోదు నుండి తొలిగిపోవాలని ప్రయత్నించినట్లు తలంచవచ్చు. నిజానికి క్రీస్తు హేరోదు ఏలుతున్న ప్రాంతానికే బయలుదేరాడు (లూకా 23:6, 7 చూడు). యోహాను బంధితుడవడం క్రీస్తును గలిలయ వెళ్లడానికి పురికొల్పిందా? యోహాను శిష్యులు చెల్లా చెదరు కాకుండ వారిని ప్రోత్సహించడానికి ప్రభువు ఉత్తరపు భాగానికి వెళ్లాడని కొందరు తలంచుతారు.[5]

యూదయను విడిచిపెట్టడం యుక్తమని క్రీస్తు ఎందుకు తలచాడో ఇంకొక కారణాన్ని యోహాను యిస్తున్నాడు: "యోహానుకంటె యేసు ఎక్కువమందిని శిష్యులుగా చేసికొని వారికి బాప్తిస్మమిచ్చుచున్న సంగతి పరిసయ్యులు వినిరని ప్రభువునకు తెలిసినప్పుడు ఆయన యూదయ దేశము విడిచి గలిలయ దేశమునకు తిరిగి వెళ్లెను" (యోహాను 4:1, 2). పరిసయ్యులను నేరుగా ప్రతిఘటించడాన్ని – కనీసం కొద్దికాలం తప్పుకోవాలని ప్రభువు కోరినట్టున్నాడు. గనుక వారి ప్రభావం బహు బలంగా ఉన్న ఆ ప్రదేశాన్ని ఆయన విడిచి వెళ్లాడు. దాదాపు ఒక సంవత్సరం యూదయలో గడిపిన మీదట, యేసూ ఆయన శిష్యులూ "గలిలయ దేశమునకు తిరిగి వెళ్లిరి" (యోహాను 4:2).[6]

## విశ్రాంతి విడిది (యోహాను 4:4-42).

యూదయనుండి గలిలయకు వెళ్లడానికి నేరైన మార్గం సమరయగుండా వెళ్లడమే,[7] అయితే సమరయులంటే, యిష్టంలేని యూదులు అనేకులు చుట్టు తిరిగి వెళ్లతారు. అంటే, వారు తూర్పుగా పయనించి, యోర్దానును దాటి, ఆ నది తూర్పు తీరం మీదుగా గలిలయవచ్చేవరకు వెళ్లుతారు. యేసైతే, సమరయగుండా తిన్నగా ప్రయాణం సాగించాడు.

"ఆయన సమరయ మార్గమున వెళ్లవలసివచ్చెను" అని యెహాను రాసాడు (యోహాను 4:4). ఆయన హడావుడిగా "వెళ్లవలసి వచ్చెను" గనుక నేరైన ఈ మార్గాన వెళ్లడంవలన క్రీస్తు సుమారు మూడు దినాల ప్రయాణ కాలాన్ని తగ్గించుకోగలుగుతాడు. ఏదియె లాగున్నా, ఆయన సమరయలో ఆగడంవలన ఆ ప్రయాణ కాలం కలిసివచ్చే ప్రసక్తి లేకుండానే పోయింది (యోహాను 4:40). ఆయన వెళ్లవలసి వచ్చింది సమరయులతో సంబంధం పెట్టుకొనడానికే అయ్యుండవచ్చు. తృణీకరింపబడిన సంకర జాతివారిని యూదులు చూచిన స్థలంలో, "అవి ఇప్పుడే తెల్లబారి కోతకు వచ్చియున్నవిగా" ప్రభువు చూచాడు (యోహాను 4:35).

సమరయ నడిబొడ్డున, బావివద్ద క్రీస్తు ఒక స్త్రీని కలుసుకున్నాడు. క్రీస్తు పరిచర్యలో విశేషమైన పరివర్తన జరిగింది.[8] మతస్థులు కానివారిని విశ్వాసంలోనికి ఎలా నడిపించాలనే స్టడీకి క్రీస్తు సమరయ స్త్రీతో చేసిన సంభాషణను గ్రహిస్తారు: ఆయన ఆమెతో ఎలా మాటలు ఆరంభించాడు; ఆమెలో ఆసక్తిని ఎలా రేకెత్తించాడు, దోషాన్ని ఆయన ఎలా దిద్దాడు లేక సవరించాడు, నూతన సత్యాలనామెకెలా తెలిపాడు. పాపాలానెలా అంగీకరింప జేసాడు, అందులో ప్రత్యేకంగా ఆమె హృదయంలో విశ్వాసాన్ని ఎలా పెంచాడు అనేవి గుర్తించబడ్డాయి.

ఈ ఒక్క సంబంధానికి ఫలితంగా, ఒక పట్టణమంతటికి ఉపదేశించే అవకాశము క్రీస్తుకు లభించింది. "ఆయన మాటలు వినినందున ఇంకను అనేకులు నమ్మి"రి (యోహాను 4:41).

## గలిలయలో పని ప్రారంభమౌతుంది
## (మత్తయి 4:13-17; మార్కు 1:14, 15; లూకా 4:14, 15; యోహాను 4:43-54)

సమరయులతో కొద్దిదినాలు గడిపిన పిమ్మట, యేసును ఆయన శిష్యులును తమ ప్రయాణాన్ని తిరిగి కొనసాగించి ఎస్రఎలోను లోయగుండా ఉత్తరాదికి వెళ్లారు. చివరికి దక్షణ గలిలయ కొండలకు చేరుకున్నారు. క్రీస్తు ఈ ప్రాంతంలో మహత్కార్యాన్ని చేయబోతున్నాడు.

ఆనాడు యెరూషలేము, యూదా, యూదా మతానికి ఆయువు పట్టుగా ఉండగా యేసు తన ప్రయాసను గలిలయలో ఎందుకు కేంద్రీకరించాడు? ఇందుకు మూడు కారణాలున్నాయి: (1) యేసు గలిలయలో పెరిగాడు, ఈ ప్రాంతం ఆయనకు చిరపరిచితమైయుంది; (2) గలిలయ ఎక్కువ జనాభాగల ప్రాంతం; మరియు (3) యూదయలోని వారికంటె గలిలయులు ఎక్కువగా అంగీకారాన్ని చూపుతారు. ఎందుకంటె వారు మత సంబంధమైన ఆచారాలకు అంతగా లోబడిన వారు కారు. అపొస్తులులలో యూదా తప్ప మిగిలిన వారందరు గలిలయులే.

### సుస్వాగతం

ఆయన గలిలయకు చేరకముందే యూదయలోని యేసు పరిచర్యను గూర్చిన సమాచారం అక్కడికి అందింది. యోహాను 4:45 యిలా అంటుంది: "గలిలయులు కూడా ఆ పండుగకు వెళ్లువారు గనుక యెరూషలేములో పండుగ సమయమున ఆయన చేసిన కార్యములన్నియు వారు చూచినందున, ఆయన గలిలయకు వచ్చినప్పుడు, వారు ఆయనను చేర్చుకొనిరి" (యోహాను 2:23 చూడు).[9]

యూదయలో వలెనే యేసు యిక్కడను ప్రసంగించ నారంభించాడు. మార్కు యిలా దాఖలు చేశాడు: "కాలము సంపూర్ణమైయున్నది, దేవుని రాజ్యము సమీపించియున్నది;

మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని[10] చెప్పుచు దేవుని సువార్త ప్రకటించుచు, గలిలయకు వచ్చెను" (1:14బి, 15; మత్తయి 4:17). లూకా యిలా వ్రాశాడు: "ఆయన అందరిచేత ఘనతనొంది, వారి సమాజ మందిరములలో బోధించుచు వచ్చెను" (4:15).[11] అది శుభ ప్రదమైన ఆరంభము.

**అద్భుతములు**

యూదయలోవలె యిక్కడను యేసు అద్భుతములు చేయ నారంభించాడు. "అప్పుడు యేసు **ఆత్మ** బలముతో గలిలయకు తిరిగి వెళ్లెను" అని లూకా 4:14ఎ అంటుంది. అద్భుతములను **ఆత్మ** బలముచేత యేసు జరిపించడాన్ని యిది సూచిస్తుంది. యేసు తిరిగివచ్చిన తరువాత తొలి అద్భుతము కానాలోనే జరిగింది.[12]

"తాను నీళ్ల ద్రాక్షారసముగా చేసిన గలిలయలోని కానాకు ఆయన తిరిగి[13] వచ్చెను" (యోహాను 4:46). ఆ ఊరివాడైన నతనియేలు (యోహాను 21:2), ఆయనను తన యింటికి ఆహ్వానించియుంటాడేమో దానికి సమీపమున నున్న కపెర్నహూములో, ఒక "ప్రధాని[14] కుమారుడు" రోగియై "చావ సిద్ధమైయుండెను" (యోహాను 4:46, 47). ఆయన కానాలో ఉన్నాడని తెలిసికొని, తన కుమారుని బాగుచేయుమని అడగడానికి త్వరపడివచ్చాడు.

ఆ ప్రధాని ప్రభువును కపెర్నహూముకు రమ్మని బతిమాలుతాడు. అయితే "యేసు – నీవు వెళ్లుము, నీ కుమారుడు బ్రదికియున్నాడని" అతనితో చెప్పాడు (యోహాను 4:50).[15] అతడు ప్రభువు మాట నమ్మి యింటిదారి పట్టాడు. అతడు తన యింటికి చేరినప్పుడు, క్రీస్తు చెప్పిన సమయంలో సరిగా తన కుమారుడు స్వస్థతపొందినట్లు గ్రహించాడు (యోహాను 4:50–53ఎ).[16] గాఢంగా ఒప్పింపబడిన అధికారియు "అతడును అతని యింటివారందరును నమ్మిరి" (యోహాను 4:53బి).[17]

ఈ అద్భుతమును, యింకను యితర అద్భుతములను గూర్చిన సమాచారమును "ఆ ప్రదేశమందంతట వ్యాపించెను" (లూకా 4:14బి). యేసు నామము ప్రతినోట పలికింది.

**కపెర్నహూముకు వచ్చుట**

గలిలయలోని ప్రభువు చేసిన మొట్ట మొదటిపని కపెర్నహూమును తన పనికి కేంద్రంగా చేసికోడం.[18] మత్తయి యిలా వ్రాశాడు: ప్రభువు – "నజరేతు విడిచి జెబూలూను నఫ్తాలియను దేశముల ప్రాంతములలో సముద్రతీరమందలి కపెర్నహూమునకు వచ్చి కాపురముండెను" (మత్తయి 4:12బి, 13ఎ).[19] కపెర్నహూములో క్రీస్తుకు స్వంత యిల్లు లేదు (మత్తయి 8:20), కాని ఆయన శిష్యులలో కొందరికి ఉంది (మార్కు 1:21, 29). క్రీస్తు గలిలయ, పరిచర్యలో, ఆ చోటునుండి, ఎన్నడు కపెర్నహూమునకు దూరంగా వెళ్లలేదు. ఆయన ఆ పట్టణం నుండి ప్రయాణాలు కొనసాగించేవాడు, తిరిగి మరల అక్కడికే వచ్చేవాడు (మార్కు 1:21, 29, 38, 39; 2:1).

కపెర్నహూము “జెబూలూను నఫ్తాలి ప్రదేశానికి” చెందింది (మత్తయి 4:13బి). ఇశ్రాయేలీయులు కనానులో ప్రవేశించినప్పుడు ఈ భూభాగము ఆ గోత్రాలవారికి కేటాయించబడింది (యెహోషువా 19). మెస్సీయ ప్రవచన భాగంగా బాగుగా ఎరుకైన దానిని నెరవేర్చడానికి గాను క్రీస్తు యిలా చేసినట్టు మత్తయి తన పాఠకులకు తెలియజేశాడు (మత్తయి 4:14-16; యెషయా 9:1, 2 చూడు).[20]

## సహాయం అవసరమయింది

## (మత్తయి 4:18-22; మార్కు 1:16-20; లూకా 5:1-11)

ఉత్తర ప్రాంతంలో అతితీవ్రంగా పనిచేయడానికి ప్రభువు కొరకు దాదాపుగా రంగం సిద్ధమయ్యింది. ఆయనకు పూర్తి సమయం శిష్యులుగా ఉండేలా వారిలో ఒక జట్టు లోపించినట్టున్నాడు. పేతురు, యాకోబు, యోహాను, అంద్రెయ అనే నలుగురు జాలరులను ప్రభువు పిలిచినట్టు మత్తయి 4, మార్కు 1, లూకా 5 తెలుపుతాయి. వీరిలో ఎక్కువ మందికి, లేక వీరందరికి యిది రెండవ పిలుపుగా అనిపిస్తుంది, ఎందుకంటే, క్రీస్తు యూదయలోని పరిచర్య కాలంలో వారు ఆయన శిష్యులు.[21]

ఈ పరిశీలన కొనసాగుతూ ఉండగా, తన శిష్యులుగా ఉండడానికి గాను ప్రభువు ఇచ్చే పిలుపులో మూడు దశలున్నట్టుగా కనిపిస్తుంది. ప్రభువు పరిచర్యకు వెళ్ళి తన వృత్తికి తిరిగి వచ్చిన బెస్తవారి వృత్తాంతం వల్ల తెలిసినట్టుగా, ఈ పిలుపు కుటుంబాన్ని, వృత్తిని వదలనవసరం లేనిది. ప్రభువు పరిచర్యలో తాత్కాలికంగా ఉన్నవారనేకులున్నారు. ఒకసారి ఆయన 70 మంది శిష్యులను సువార్త ప్రకటించుటకై పంపాడు (లూకా 10:1-20).

రెండవ దశలో నిరంతర శిష్యులు. ఆయన పిలుపునకు స్పందించినవారు, ప్రభువుతో పయనిస్తూ నివసిస్తూ ఉంటారు. వీరి సంఖ్య చాలా తక్కువ. మన లేఖన భాగంలో పిలువబడే ఈ నలుగురు ఈ రెండవ వర్గానికి చెందినవారైయుంటారు.

ప్రభువు పన్నెండు మందిని అపొస్తలులుగా ఎన్నుకోడంతో మూడవ దశ మొదలవుతుంది: స్మరించదగినదిగా ఉండే ఆ సంఘటనను గూర్చి తరువాత చదువుదాం. ఏదియెలగున్నా, ప్రస్తుతానికి, క్రీస్తుకు నిరంతర సహవాసులుగా ఉండేలా పిలువబడిన ఈ నలుగురు జాలరుల మీద మన దృష్టి నిలుపుదాం.

ఈ పిలుపును గూర్చి సినాప్టిక్ గాస్పల్ లేఖకులు ముగ్గురు తెలుపుతారు. ఈ మూడు లేఖన భాగాలను సమన్వయం చేయడం కొంత కష్టం పిలుపునందుకున్న నలుగురిని గూర్చి మత్తయి, మార్కులు తెలియజేస్తుండగా, లూకా ముగ్గురినే ప్రస్తావించుతాడు. మత్తయి మార్కుల రచనలను మాత్రమే నీవు చదివితే, యింకెవరూ ఉన్నట్టు నీవు ఎరుగలేవు. అయితే, జనసమూహానికి ప్రభువు ప్రసంగిస్తున్నట్టు తెలుపుతూ, గొప్ప చేపలను పట్టిన అద్భుతాన్ని లూకా ప్రస్తావిస్తాడు.

ఈ వ్యత్యాసాలను బట్టి, మత్తయి, మార్కులు చెప్పిన దానికి భిన్నమైన మరో సంఘటనను గూర్చి లూకా చెప్పినట్టు కొందరు తీర్మానించారు. అయితే పలు

వివరాలు – ఆ సంఘటన యిదే అన్నట్టుగా సూచిస్తాయి. ఈ మూడు వర్ణనలు కూడా: (1) ఒకే స్థలాన్ని – గలిలయ సముద్రాన్ని సూచిస్తాయి[22] (మత్తయి 4:18; మార్కు 1:16; లూకా 5:1); (2) మూడు ఒకే మనుష్యులను – పేతురు, యాకోబు, యోహానులు (మత్తయి 4:18, 21; మార్కు 1:16, 19; లూకా 5:3, 10[23]); (3) ఒకే వృత్తి – వలలను శుద్ధిచేసికొనడం (మత్తయి 4:21; మార్కు 1:19; లూకా 5:2); (4) అదే పిలుపు – మనుష్యులను పట్టేవారిగా చేస్తాననేది (మత్తయి 4:19; మార్కు 1:17; లూకా 5:10); మరియు (5) అదే బదులు – తెజించి ఆయనను వెంబడించడం (మత్తయి 4:20, 22; మార్కు 1:18, 20; లూకా 5:11).

ఇవన్నీ ఒకే సంఘటనను సూచిస్తున్నట్టయితే, ఈ సమాచారాలను సమన్వయ పరచడం ఎలాగు? ఈ క్రింది దృశ్యాన్ని ఆలోచించి చూడు.[24]

యేసూ, ఆయన శిష్యులూ గలిలయకు తిరిగి వచ్చిన తరువాత – పేతురు, యాకోబు, యోహాను, అంద్రెయలనే వారు తమ వృత్తికి వెళ్లారు – వారు గలిలయ సముద్రములో చేపలు పట్టేవారు. ఒకనాటి ఉదయాన, ఆ మనుష్యులు సాధారణంగా ఎక్కడ చేపలు పట్టుతూ ఉంటారో ఆ తీరానికి సమీపంగా ప్రభువైన యేసు నడుస్తూ వెళ్లారు. ఎలాంటి ఫలితమూ చిక్కని రాత్రి తరువాత, యాకోబు యోహానులు అప్పటికే నిరీక్షణ కోల్పోయిన వారై తీరమునకు వచ్చి తమ వలలు బాగుచేసి కొంటున్నారు. అందరికంటె మొండివాడైన పేతురు యింకను ప్రయత్నం వీడనట్టుగా కన్పిస్తాడు. అయినా, కడకు అతడు తన ఓటమిని అంగీకరింపవలసి వచ్చింది. అతడును, అంద్రెయయు ఒడ్డునకు వచ్చినట్టున్నారు.

అంతలో, ప్రభువు సమీపమున ఉన్నట్టు వార్త వ్యాపించింది. ఒక గుంపు కూడింది. యేసు వారికి బోధింపనారంభించాడు. ప్రజల కూటమి ఎక్కువ అయ్యేసరికి, ఆయన పేతురు నావలోనికి వెళ్లి దానిని కొంచెం లోపలికి తోయమని ఆదేశించి, దానిలోనుండి ఒడ్డున నిలిచియుండిన జనసమూహానికి బోధించాడు.

దీని వెంటనే ఒక అసాధారణమైన అద్భుతం జరిగింది: అప్పుడు విశేషమైన చేపలు గాలానికి చిక్కాయి. చేపలు పట్టేవారికే ఆశ్చర్యాన్ని కలిగించగా, పేతురు మోకాళ్ళమీదకు వంగాడు.[25] అలా తన పిలుపుకు లోబడేలా ఆ జాలరుల హృదయాలను ప్రభువు సిద్ధం చేశాడు. ప్రభువు పిలుపు, దానికి వచ్చిన స్పందనను గూర్చి – మత్తయి యిలా రికార్డు చేశాడు: “ఆయన నా వెంబడి రండి, నేను మిమ్మును[26] మనుష్యులను పట్టు జాలరులనుగా చేతునని వారితో చెప్పెను; వెంటనే వారు తమ వలలు విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి” (మత్తయి 4:19, 20; 4:21, 22; మార్కు 1:17–20లను కూడా చూడు). లూకా వివరణ కూడా ప్రాథమికంగా అదే. ప్రభువు పిలుపు, దానికి వచ్చిన స్పందనను ఈ మాటలతో అతడు వర్ణిస్తున్నాడు: “–ఇప్పటి నుండి నీవు మనుష్యులను పట్టువాడవై యుందువని సీమోనుతో చెప్పెను. వారు దోనెలను దరికిచేర్చి, సమస్తమును విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి” (లూకా 5:10, 11).

ఈ విధంగా, ఈ తొలి శిష్యులను శాశ్వతమైన అంతరాయమురాని శిష్యత్వమునకు ప్రభువు పిలిచాడు. ఇప్పుడు, క్రీస్తుకు రాత్రనక పగలనక సహచరులు తనతో ఉండడం మాత్రమేగాక, అపొస్తలులుగా తాను నియమించుకోబోయే పన్నిద్దరిలో వీరు మూడింట

ఒక వంతుగా నిలిచిపోతారు. పైగా, ఈ నలుగురిలో ముగ్గురు "ఆంతరంగికులుగా," ప్రభువుకు ప్రత్యేకమైన వారుగా నిలిచియుంటారు (మార్కు 5:37; 9:2; 14:33).

## ముగింపు

గలిలయ పరిచర్యకు సమస్తము సిద్ధమైంది. తరువాత పాఠంలో, యేసు తన ప్రసంగాలకు స్వస్థతలకు సంబంధించిన ప్రయాణాలను ఎలా సాగించాడో చూస్తాం. ఉత్సాహకరమైన దినాలు ముందున్నాయి!

---

సూచనలు

[1]మత్తయి 14:1-12; మార్కు 6:14-29లను చూడు. [2]దీనిపై ఎక్కువ సమాచారం కొరకు – "క్రీస్తు జీవితం, భాగం 1ని" చూడు. [3] చార్టు చూడు. హేరోదుల మీద ఎక్కువ సమాచారం కొరకు "కార్యగ్రంథం భాగం 3" చూడు. [4]"విజయంలోని అపాయం" అనే పాఠాన్ని "క్రీస్తు జీవితం" పరంపరలో మరియు "అరణ్యంలో కేకవేయు ఒకని శబ్దం" అనే పాఠం కూడా చూడు. [5]అయినోను అనేది ఉత్తరపు యూదయలోనిదని ఎక్కువమంది ఆలోచిస్తారు (యోహాను 3:23). అది సమరయ కావచ్చు. (పటం చూడు). [6]యోహాను 4:8 యేసు శిష్యులు ఆయనతో పయనించినట్లు తెలుపుతుంది. [7]పటం చూడు. [8]"యజమానుని కలిసికో," లో "పాపాత్మురాలైన స్త్రీ కథ" చెప్పబడింది. [9]యోహాను 4:44లో యోహాను ఒక వింతైన గమనికను చొప్పించాడు. "ఎందుకనగా ప్రవక్త స్వదేశములో ఘనత పొందడని యేసు సాక్ష్యమిచ్చెను." యేసు యూదయను విడిచిపెట్టడానికి కారణం యిది అయ్యుండవచ్చు – అయితే సువార్త రచనలలో గలిలయ తన "స్వదేశంగా" తెలిపారు. గలిలయలో తనకు లభించిన ఘనస్వాగతం ఆలాగే నిలిచియుంటుందని ప్రభువు తలంచలేదు (మత్తయి 13:57; మార్కు 6:4; లూకా 4:24 చూడు). [10]మారుమనస్సు పొంది విశ్వసించడం అనేది ఆసహజమైనది. సాధారణంగా, జనులు మొదట యేసునందు విశ్వాసముంచుతారు – అది పాపముల విషయమై మారుమనస్సు పొందేలా చేస్తుంది.

[11]పద్ధతి ప్రకారం, సమాజ మందిరం సబ్బాతు దినాన రెండు సార్లు కూడుతుంది, సోమవారం ఒకసారి, గురువారం ఒకసారి కూడతారు. అనేక పట్టణాల్లో సోమవారం గురువారాలు సంతలు జరుగుతాయి. ఇతర సమయాల్లో కూడా సమాజమందిరాలు తెరువబడతాయి. ఆ సమయాలు ప్రభువు బోధించడానికి అవకాశాలను కల్పిస్తాయి. [12]"రెండవ సూచక క్రియ" అని యోహాను 4:54లోనిది, అద్భుతమే; మొదటిది 2:11లో నీళ్లను ద్రాక్షారసముగా చేయడం (2:11), యేసు చేసిన యూదయలోని అద్భుతాలు (2:23; 3:2). [13]కానానుకు కపెర్నహూము ఉత్తరం వైపు 20 మైళ్లు ఉంటుంది. [14]ఆది భాషలోని అక్షరార్థం – "రాజు యొక్క మనిషి." హేరోదు కోర్టులో ఒక అధికారి కావచ్చు. [15]ప్రభువు ప్రతిచర్య ఆ ప్రధానిపట్ల అసాధారణంగా ఉంది (యోహాను 4:48). "you" అనేది గ్రీకులో బహువచనంలో ఉంది. తన మాటను బట్టి గలిలయులకు సమరయులకు – తారతమ్యాన్ని చూపుతున్నాడు (4 వ.) – అద్భుతం అక్కర లేకుండానే వారు నమ్మారు. అయితే ప్రభువునందు అతడు విశ్వసించినందున ఆయన మాటలు అతనిని దూరం చేయలేదు. [16]దూరం నుండి ప్రభువు జరిగించిన స్వస్థతలలో యిది ఒకటి: మత్తయి 8:5-13 మరియు లూకా 7:1-10; మత్తయి 15:22-28; మార్కు 7:25-30; లూకా 17:11-37. [17]ఒక వ్యక్తి తన యింటివారితో తన విశ్వాసాన్ని పంచుకునేదానికి మంచి ఉదాహరణ. [18]ముందుగా కపెర్నహూమును ప్రభువు సందర్శించాడు (యోహాను 2:12). [19]ఈ సందర్భంలో, అనేక పొందికల్లో లూకా 4:16-30ని యిక్కడ చూపిస్తారు – నజరేతునుండి ప్రభువు కపెర్నహూముకు ఎందుకు మార్చుకున్నారో. (1) ఇక్కడ నేను దాన్ని చేర్చడం లేదు. "కపెర్నహూములో ఏమి చేయ బడిందో" ఈ లేఖన భాగం సూచిస్తుంది (లూకా 4:23). అయితే ఈ సమయంలో, మన పొందికలో, కపెర్నహూములో ఏమి చేయబడలేదు. (2) ... తీవ్రమైన తిరస్కరింపు యేసు గలిలయ పరిచర్యలోని చివరి భాగానికి సరిపోతుంది. సందర్భంలో ఈ విషయాన్ని చేర్చవచ్చు. "తిరస్కారాన్ని ఎదుర్కొనుట ఎలాగు?" అనే పాఠాన్ని చూడు. [20]6, 7 వచనాలలోని ప్రవచనాన్ని చదువు.

[21]యోహాను 1:40, 41, ప్రత్యేకించి పేతురు, అంద్రెయలను ప్రస్తావిస్తుంది. పేరు చెప్పబడని శిష్యుడు యోహానై య్యుండవచ్చు (యోహాను 1:37, 40). వాక్య భాగంలో పదం యోహాను యాకోబును కనుగొన్నట్టు అంద్రెయ పేతురును కనుగొన్నట్టు సూచిస్తుంది. [22]“గెన్నేసరెతు సరస్సు” అని లూకా అంటాడు (5:1). గలిలయ సముద్రానికి యిది మరియొక పేరు. [23]మత్తయి, మార్కు నాల్గవ వ్యక్తిగా అంద్రెయను ప్రస్తావిస్తారు. లూకా ప్రత్యేకించి అంద్రెయను ప్రస్తావించాడు (లూకా 5:6, 7, 10). అంద్రెయ అతనితో చేపలుపట్టువాడు గానే పని చేశాడు (మత్తయి 4:18). [24]వ్యత్యాసాలను సరి చేయవచ్చు. [25]ఈ అంశం మీద పాఠం “శిష్యులుగా పిలుపబడుట” అనే దానిలో వివరాలకు చూడు. [26]“I will make you”: అనే దానిమీద Will Ed. Warren ప్రత్యేకమైన ప్రాధాన్యతను పెట్టాడు (Will Ed Warren, Class Syllabus, *The Life of Christ: The Synoptic Gospels*, Harding University, 1991, 16).